ప్రజా విశ్వంభర
V3 NEWS



## 'కాంతార' వివాదం.. చాముండేశ్వరి ఆలయాన్ని సందర్శించిన రణ్‌వీర్

ఓ అవార్డుల వేడుకలో బాలీవుడ్ రణ్‌వీర్ సింగ్ 'కాంతార'లోని పంజుర్లి హావభావాలను ప్రదర్శించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. కర్ణాటక హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇప్పటికే పశ్చాత్తాపం వ్యక్తం చేసిన ఆయన.. తాజాగా మైసూరులోని చాముండేశ్వరి దేవి ఆలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం అక్కడ పూజలు నిర్వహించారు. 'డాన్ 3' విషయంలో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) తనపై బ్యాన్ విధించిన మరుసటి రోజు రణ్‌వీర్ ఈ ఆలయాన్ని సందర్శించడం గమనార్హం.







## సుకుమార్ ఆఫర్.. నాకూ షాకే: సునీల్

కమెడియన్‌గా తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన సునీల్.. హీరోగా, విలన్‌గానూ మెప్పించారు. వేరే చిత్ర పరిశ్రమల్లోనూ అవకాశాలు అందుకున్నారు. తాజాగా.. మలయాళ మూవీ 'కాటాలన్'లో కీలక పాత్ర పోషించారు. తెలుగులోనూ ఈ సినిమా గురువారం (మే 28) విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సునీల్, కబీర్ దుహాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.'దర్శకుడు సుకుమార్..మీలో మంగళం శ్రీనును ఎలా చూశారు?' అని అడగ్గా.. అది నిజంగా నాకూ షాకే అంటూ సునీల్ నవ్వులు పూయించారు. ''కామెడీ రోల్స్ కాకుండా వేరే క్యారెక్టర్లూ ప్లే చేస్తున్నాని లాక్‌డౌన్‌లో సుకుమార్‌కు చెప్పా. తర్వాత రెండు రోజుల్లో ఫోన్ చేసి.. ''పుష్ప'లో పూర్తిస్థాయి విలన్ క్యారెక్టర్‌కు నిన్ను అనుకుంటున్నా. అందులో నువ్వు కామెడీ చేయకూడదు. శరీరం కూడా కదలకుండా.. హావభావాలు పలికించాలి' అని చెప్పారు. లుక్ టెస్ట్ కోసం కాస్ట్యూమ్స్ పంపారు. ఒక్కో డ్రెస్సులో ఒక్కో స్టైల్‌లో ఫొటోలు దిగి, మూవీ టీమ్‌కు సెండ్ చేశా. వారికి బాగా నచ్చింది. అలా ఎంపికయ్యా. షూటింగ్ జరిగినన్ని రోజులూ నుదురు భాగంలో షేవ్ చేసుకునేవాడిని'' అని గుర్తుచేసుకున్నారు.'పుష్ప' సినిమాలో నటించడంతో తన జీవితం మారిపోయిందన్నారు. అన్ని భాషల్లోనూ నటించే అవకాశాలను ఈ చిత్రం ఇచ్చిందని పేర్కొన్నారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన 'పుష్ప 1', 'పుష్ప 2' ఎంత పెద్ద హిట్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక, 'కాటాలన్'లో మారి అనే పాత్ర పోషించారు సునీల్. ఆంటోనీ వర్గీస్, కబీర్ దుహాన్ సింగ్, దుషారా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. పాల్ జార్జ్ దర్శకుడు. ఏనుగు దంతాల అక్రమ రవాణా ఇతివృత్తంగా రూపొందిన చిత్రమిది.



## కుమార్తె డ్యాన్స్‌పై ట్రోల్స్.. రియాక్ట్ అయిన చంకీ పాండే

తన కుమార్తె, నటి అనన్యా పాండే డ్యాన్స్ పెర్ఫామెన్స్‌పై వచ్చిన ట్రోల్స్‌పై నటుడు చంకీ పాండే స్పందించారు. కేవలం ఒక్క సన్నివేశం చూసి జడ్జ్ చేయడం కరెక్ట్ కాదని, సినిమా చూసి అసలు విషయాన్ని అర్థం చేసుకున్నాక రియాక్ట్ అయితే బాగుంటుందని సమాధానమిచ్చారు.లక్ష్య, అనన్య జంటగా నటించిన సినిమా 'చాంద్ మేరా దిల్' . వివేక్ సోనీ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామా మూవీ ఈనెల 22న విడుదలైంది. ఇందులో.. ఓ వేదికపై సంప్రదాయ దుస్తుల్లో అనన్య నృత్యం చేస్తున్న దృశ్యాలు బయటకొచ్చాయి. భరతనాట్యాన్ని అగౌరవపరిచారంటూ మేకర్స్‌ను కొందరు నెటిజన్లు విమర్శించగా.. మరికొందరు అనన్య పెర్ఫామెన్స్‌పై ట్రోల్స్ చేశారు. 'ట్రెడిషనల్ భరతనాట్యం వర్సెస్ బాలీవుడ్ నాట్యం' అంటూ మీమ్స్ కూడా క్రియేట్ చేశారు. అయితే, సినిమాలో భరతనాట్యాన్ని ప్రదర్శించలేదని, అది కల్చరల్ ఈవెంట్లలో విద్యార్థులు ప్రదర్శించే ఫ్యూజన్ డ్యాన్స్ పెర్ఫామెన్స్ లాంటిదని చంకీ పాండే వివరణ ఇచ్చారు. విమర్శించిన వారంతా అపార్థం చేసుకున్నవారే అని పేర్కొన్నారు.

## 17 ఏళ్ల తర్వాత ఆ ప్రయోగం.. 'పెద్ది' కథను మలుపు తిప్పే మ్యాచ్ అది!




దాదాపు 17 ఏళ్ల తర్వాత 'పెద్ది'లో ఢిల్లీ ఎపిసోడ్ కోసం మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించామని సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీకపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికర విశేషాలను రత్నవేలు పంచుకున్నారు.

**అవన్నీ రీ క్రియేట్ చేశాం..**

''పెద్ది' దాదాపు 40 ఏళ్ల క్రితం విజయనగరంలో జరిగే కథ. ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కానీ, ఒకప్పటి విజయనగరానికి ప్రేక్షకులను తీసుకెళ్లాలి. అదంతా ఒక ఊహా ప్రపంచం. రిఫరెన్స్ కోసం కొన్ని ఇమేజెస్ తీసుకుని, 'పెద్ది' కథను ఎలా చెప్పాలి? విజువల్‌గా ఎంత అందంగా క్రియేట్ చేయాలనే దానిపై చాలా పకడ్బందీగా వర్క్ చేశాం. క్లాక్ టవర్, వీధులు, షుగర్ ఫ్యాక్టరీ ఇలా ఒక్కో అంశాన్ని వరల్డ్ బిల్డింగ్ చేస్తూ వెళ్లాం. కొండ ప్రాంతాలు, అక్కడి ప్రజలు, వారి లైఫ్ స్టయిల్ ఇలా ప్రతిదీ చాలా సహజంగా ఉంటుంది''

**కథను మలుపు తిప్పే మ్యాచ్..**

''పెద్ది'లో నాకు అత్యంత కష్టంగా అనిపించింది క్రికెట్ మ్యాచ్. ఇది స్పోర్ట్స్ బేస్డ్ సినిమా. కెమెరామెన్‌తో పాటు మొత్తం టీమ్ చాలా జాగ్రత్తగా ఉండాలి. సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ చాలా కీలకం. అది కేవలం మ్యాచ్ మాత్రమే కాదు, కథలోనే ఒక పెద్ద మలుపు. ఆ మ్యాచ్‌ను రాత్రిపూట షూట్ చేద్దామని బుచ్చిబాబు గారికి సూచించాను. 80లలో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ మూడ్ కోసం నైట్ షూట్ అయితే బాగుంటుందని అనిపించింది. ఆయనకు ఆ ఆలోచన నచ్చింది''

**హనుమంతుడి రెఫరెన్స్..**

''అలాగే కుస్తీ పోటీలు కూడా మరో పెద్ద ఛాలెంజ్. ఒక గెటప్ అనుకున్న తర్వాత కాస్ట్యూమ్స్, బాడీ మార్చుకుంటే సరిపోతుంది. కానీ, ఇందులో రామ్ చరణ్ కుస్తీ విషయానికి వచ్చేసరికి తన బాడీలోని ప్రతి మజిల్‌పై వర్క్ చేశారు. ప్రతి మజిల్‌ను డెవలప్ చేసి, ఒక రియల్ పహిల్వాన్‌లా కనిపించారు. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ సీక్వెన్స్‌లో ప్రత్యేకమైన లైటింగ్ డిజైన్ చేశాను. అది మీరు థియేటర్‌లో చూసినప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి''.

**చివరి 30 నిమిషాలు ప్రేక్షకుడిని కదలిస్తుంది..**

''ఈ సినిమా క్లైమాక్స్ కూడా చాలా ఛాలెంజింగ్. ఇప్పుడే దాని గురించి ఎక్కువ చెప్పకూడదు. అది ప్రేక్షకులకు కన్నుల పండుగలా ఉంటుంది. విజువల్ గ్రాండియర్‌తో పాటు ఎమోషనల్ హై కూడా ఉంటుంది. చివరి 30 నిమిషాలు సినిమా ప్రేక్షకులని కదిలిస్తుంది. చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఇందులో దిల్లీలో చిత్రీకరించిన సన్నివేశాలు నాకు చాలా ఫేవరెట్. అక్కడ నేను లైట్ లేకుండా షూట్ చేశాను. దాని కోసం ఫిల్మ్ నెగటివ్‌ను వాడాం. దాదాపు 17 ఏళ్ల తర్వాత మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించాను. ఇప్పుడు ఉన్న డిజిటల్ కెమెరాలు అద్భుతమైన ఔట్‌పుట్ ఇస్తున్నప్పటికీ, ఒక రియల్ ఫీల్ కోసం వాడాం''

**మంచి యాక్షన్ థ్రిల్లర్ తీస్తా!..**

''నేను ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 30 సంవత్సరాలు అయ్యింది. ఏడాదికి ఒక సినిమానే చేస్తాను. ఒక సినిమా కమిట్ అయితే అది పూర్తయ్యే వరకు వేరేవి చేయను. ఇప్పటికే మూడు కథలు రాశాను. మంచి ఎమోషన్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌ను డైరెక్ట్ చేయాలనుకుంటున్నాను. అలాగే ప్రతి పాత్ర కూడా కథలో ఇంపార్టెంట్‌గా ఉండాలి. మా అబ్బాయి కూడా కెనడాలో సినిమాటోగ్రఫీ చదువుకున్నాడు. నాలాగే తనకూ సినిమాపై చాలా ప్యాషన్. 'పెద్ది'లో ఒక కుస్తీ ఫైట్ అద్భుతంగా షూట్ చేశాడు'' అని అన్నారు.




## ముంబైకి గుడ్ బై..హార్దిక్ పాండ్యాకు ఆ ఫ్రాంచైజీ బంపర్ ఆఫర్ !

**విశ్వంభర, స్పోర్ట్స్** : ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ అత్యంత చెత్త ప్రదర్శన కనబరిచింది. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ఉన్న ముంబై ఇండియన్స్, ఈ సారి పాయింట్స్ టేబుల్ లో 9వ స్థానంలో నిలిచి... ఇంటి దారి పట్టింది. ఐపీఎల్ 2026లో కేవలం నాలుగు మ్యాచ్ ల్లో మాత్రమే విజయకేతనం ఎగరవేసింది. అయితే ముంబై ఫెయిల్యూర్ నేపథ్యంలో హార్దిక్ పాండ్యాను అందరూ విలన్ చేశారు. అతని వల్లే ముంబై ఇండియన్స్ చెత్త ప్రదర్శన కనబరిచిందని ఫ్యాన్స్ కూడా ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ ను వదిలేసి.. మరో జట్టులోకి వెళ్లేందుకు ఇప్పటికే హార్దిక్ పాండ్యా ప్రయత్నం మొదలు పెట్టాడట. మొన్న చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యంతో చర్చలు జరిగినట్లు ఫోటోలు కూడా వైరల్ అయ్యాయి. అయితే, హార్దిక్ పాండ్యా లాంటి వాళ్లు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో మెదలడం కష్టమేనని యాజమాన్యం ఓ నిర్ణయానికి వచ్చిందట. దీనిపై ఇప్పుడే ముందుకు వెళ్లొద్దని అనుకుంటున్నారట. ఈ క్రమంలో హార్దిక్ పాండ్యాకు మరో బంపర్ ఆఫర్ తగిలినట్లు తాజాగా ఫోన్ న్యూస్ వైరల్ గా మారింది. తమ జట్టులోకి హార్దిక్ పాండ్యాను ట్రేడింగ్ ద్వారా తీసుకునేందుకు కేకేఆర్ తొలి అడుగు వేసినట్లు చెబుతున్నారు. ఒకవేళ ఈ డీల్ సెట్ అయితే కేకేఆర్ కెప్టెన్ గా హార్దిక్ పాండ్యా మెరువనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు ఉన్నాయి. రహానే స్థానంలో పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారని టాక్. నిజంగానే కేకేఆర్ నుంచి ఈ ఆఫర్ వస్తే ముంబైని వదిలేసేందుకు హార్దిక్ పాండ్యా కూడా సిద్ధమైనట్లు చెబుతున్నారు.

## ఇన్‌స్టాలో 200కు పైగా పోస్టులు తొలగించిన అర్ష్‌దీప్..

**విశ్వంభర, స్పోర్ట్స్** : టీమ్‌ఇండియా పేసర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు అర్ష్‌దీప్ సింగ్ సోషల్ మీడియాలో ఎంత చురుగ్గా ఉంటాడో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తీరిక సమయాల్లో తోటి ఆటగాళ్లతో రీల్స్, వ్లాగ్స్ చేస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో అభిమానులతో పంచుకుంటుంటాడు. అతను చేసే రీల్స్‌కు నెటిజన్లలో మంచి ఆదరణ ఉంది. అయితే, ఇటీవల జరిగిన పరిణామాలతో అర్ష్‌దీప్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నాడు. అతను తన ఇన్‌స్టా ఖాతాలో 200కు పైగా పోస్టులను తొలగించాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 44 పోస్టులు మాత్రమే కనిపిస్తుండగా.. ఇందులో చాలావరకు వివిధ బ్రాండ్ల ప్రచారానికి సంబంధించినవే ఉన్నాయి. గత డిసెంబర్‌లో విరాట్ కోహ్లీతో కలిసి చేసిన ఓ రీల్ కూడా అర్ష్‌దీప్ ఇన్‌స్టాలో కనిపించకపోవడంతో ఫ్యాన్స్ ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. కోహ్లీతో చేసిన ఆ రీల్ దాదాపు 15 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఈ మధ్య అర్ష్‌దీప్ సోషల్ మీడియాలో ఏం చేసినా అది వివాదానికి దారితీస్తోంది. కొన్నిరోజుల కిందట ఈ పేసర్ విమానంలో వ్లాగ్ చేయగా.. ఆ వీడియోలో




యుజ్వేంద్ర చాహల్ వేపింగ్ చేస్తున్నట్లు కనిపించింది. దానిపై తీవ్ర విమర్శలు రావడంతో ఐపీఎల్ ముగిసేవరకు సోషల్ మీడియాలో వ్లాగింగ్ చేయొద్దని అర్ష్‌దీప్ సింగ్‌ను బీసీసీఐ ఆదేశించింది. ఇటీవల ముంబయి ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు సామాజిక మాధ్యమంలో పంచుకున్న ఓ వీడియోలో తిలక్ వర్మ రంగు నుద్దేశించి 'ఓయ్.. అంధేరా' అంటూ అర్ష్‌దీప్ సంభోదించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. దీంతో పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లకు ఫ్రాంచైజీ సోషల్ మీడియా వినియోగంపై కొత్త మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిసింది. టీమ్ ప్లేయర్లకు సంబంధించిన వీడియోలు ఇకపై ఫ్రాంచైజీ అధికారిక ఖాతాల ద్వారానే రూపొందించి విడుదల చేయాలని సూచించినట్లు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో అర్ష్‌దీప్ ఇన్‌స్టాలో పోస్టులు డిలీట్ చేసి ఉంటాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్ 2026లో పంజాబ్ జట్టు ఆరంభంలో వరుసగా విజయాలు సాధించినా.. తర్వాత తడబడి ప్లే ఆఫ్స్‌కు దూరమైన సంగతి తెలిసిందే.

## ఆర్సీబీ ఆ నిర్ణయం ఎందుకు తీసుకుందో తెలీదు: యశ్ దయాళ్

**విశ్వంభర, స్పోర్ట్స్** : ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌కు దూరంగా ఉండటంపై ఆర్సీబీ బౌలర్ యశ్ దయాళ్ ఎట్టకేలకు మౌనం వీడాడు. ఆర్సీబీ తన జట్టు అని.. తనను తొలగించలేదన్నాడు. రిటైన్ జాబితాలో తాను ఉన్నట్లు వెల్లడించాడు. టోర్నమెంట్ నుంచి వైదొలగడం తన వ్యక్తిగత నిర్ణయం కాదని, అది ఫ్రాంచైజీ నిర్ణయమని పేర్కొన్నాడు. ఇంట్లో కూర్చొని ఆర్సీబీ మ్యాచ్‌లను చూడటం మానసికంగా సవాల్‌గా ఉందన్నాడు. జట్టుతో కలిసి ఉండటాన్ని, డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం తాను మిస్ అవుతున్నానని తెలిపాడు.''నేను టీవీలో వారి ఆటను చూస్తున్నప్పుడు కొన్నిసార్లు ఒక్కసారిగా లేచి నిలబడతాను. అది నా జట్టు. వారు నన్ను టీమ్ నుంచి తొలగించలేదు. నన్ను 'రిటైన్' జాబితాలోనే ఉంచారు. నా స్థానంలో వేరే ఎవరినీ తీసుకోలేదు. బహుశా నేను జట్టులో ఒక ముఖ్యమైన భాగమని వారు భావిస్తున్నారేమో. ఈ సీజన్ నుంచి తప్పుకోవడం నా వ్యక్తిగత నిర్ణయం కాదు. ఈ వ్యాఖ్య వివాదాస్పదంగా అనిపించవచ్చు. కానీ ఆ నిర్ణయాన్ని ఎప్పుడూ సంబంధిత యాజమాన్యమే




తీసుకుంటుంది. ఆర్సీబీ ఆ నిర్ణయం తీసుకోవడం వెనుక అసలు కారణమేంటో నాకు తెలియదు. నేను వారిని ఎంతగానో మిస్ అవుతున్నాను. జట్టు నన్ను మిస్ అవుతుందో లేదో తెలియదు. ఆ విషయం అభిమానులే చెప్పాలి. యాజమాన్యంతో చర్చలు జరుపుతూనే ఉన్నాను. డైరెక్టర్, కోచ్, అలాగే దినేశ్ కార్తీక్‌తో మాట్లాడాను. మేము ఎప్పటికప్పుడు సంప్రదించుకుంటూనే ఉంటాం. మా మధ్య సంబంధం ఏమాత్రం తెగిపోలేదు. మా మధ్య ఎటువంటి కమ్యూనికేషన్ గ్యాప్ లేదు. అంతా స్పష్టంగా, సవ్యంగా ఉంది'' అని యశ్ దయాళ్ పేర్కొన్నాడు. యశ్ దయాళ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో అతడిని ఈ సీజన్‌లో ఆడొద్దని సూచించినట్లు తెలుస్తోంది. యూపీకి చెందిన ఓ యువతి దయాళ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. తర్వాత రాజస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయి క్రికెట్‌లో కెరీర్ చూపిస్తానని నమ్మించి రెండేళ్లుగా యశ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించింది. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు.



## కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి భయపడను..

బాలీవుడ్ హాట్ బ్యూటీ మౌనీ రాయ్ గత కొద్ది కాలంగా నిత్యం వార్తల్లో నిలుస్తోంది. ఇటీవల తన భర్త సూరజ్ నంబియార్ నుండి విడిపోతున్నట్లు అధికారికంగా ప్రకటించి అందరికీ పెద్ద షాక్ ఇచ్చింది. ఈ విడాకుల విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా స్వయంగా నెటిజన్లతో పంచుకుంది. తామిద్దరం ఇష్టపూర్వకంగానే, ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా విడిపోవాలని నిర్ణయించుకున్నామని మౌని తెలిపింది. జీవితంలో ఎదురైన ఈ క్లిష్ట సమయంలో తమ వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని, ప్రైవసీ ఇవ్వాలని ఆమె కోరింది. అలాగే సోషల్ మీడియాలో తమ బంధంపై వస్తున్న రకరకాల అబద్ధపు ప్రచారాలను, రూమర్లను నమ్మవద్దని స్పష్టం చేసింది. పర్సనల్ లైఫ్‌లో ఇంత పెద్ద బాధాకరమైన సంఘటన జరిగినప్పటికీ, మౌని రాయ్ ఎక్కడా తన ధైర్యాన్ని కోల్పోలేదు. తన ప్రొఫెషనల్ లైఫ్‌పై పూర్తి ఫోకస్ పెట్టింది. ప్రతిష్టాత్మక 'కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026' లో ఆమె మెరిసింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మౌని తన నటన, కెరీర్ గురించి ఎమోషనల్‌గా మాట్లాడింది. "నాకు నటన అంటే పిచ్చి. మంచి పాత్రలు చేయడం కోసం నేను ఎప్పుడూ ఆకలితో ఉంటాను. కేవలం గ్లామర్ పాత్రలే కాకుండా.. కామెడీ, ట్రాజెడీ, విలన్ షేడ్స్ ఉన్న డార్క్ క్యారెక్టర్స్.. ఇలా ఎలాంటి రోల్స్ ఇచ్చినా చేయడానికి నేను రెడీ. కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి ఎప్పుడూ భయపడను" అని మౌని రాయ్ చెప్పుకొచ్చింది. బుల్లితెర టీవీ సీరియల్స్ నుండి వెండితెరపై నటిగా మారిన తన ప్రయాణం ఒక రోలర్ కోస్టర్ లాంటిదని ఇందులో ఎన్నో కష్టాలు, ఫ్లాపులు, హిట్లు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. అయితే నటనపై తనకున్న ప్రేమ మాత్రం ఎప్పుడూ తగ్గలేదని, ప్రతిరోజూ పొద్దున్నే లేచి షూటింగ్‌కు వెళ్లడమే తనకు దేవుడిచ్చిన గొప్ప బహుమతి అని ఎమోషనల్ అయ్యారు. ఇక ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఈవిషయం తెలుసుకున్న నెటిజన్లు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com